కట్నం ప్రసక్తి లేకపోయినా డబ్బుసంచికి తాళికట్టిన ఓ వరుడి కథ!

# కట్నం వద్దు...

## వి.పి.టి. నాయర్ కథ

''అతను ఒక స్కూల్ టీచర్''

''అతనూ అంటే ఎవరు?''

''అదేకదా నేను చెప్తున్నది. అతనొక హైస్కూలు ఉపాధ్యాయుడు''

''అది కాదయ్యా నేనడిగేది. ఆయనకిక ఊరూ పేరూ లేవా అని?''

''ఉన్నాయి. ఉన్నాయి. ఒక మామూలు మనిషికి ఉండవలసినవన్నీ అతనికీ ఉన్నాయి. ఊరు లేకుండా ఎట్లా వుంటుంది? పై ఆకాశాన్నుండి ఫ్లయింగ్ సాసర్‌లో వచ్చాడా? అతనికి పేరులేదా అని అసలు నీవెట్లా అడిగావు? మనిషిగా పుట్టినవాడికి పేరులేదని చెప్పడానికి నేనేమైనా పిచ్చివాణ్ణా? ప్రస్తుతం అతని ఊరగా పేరగా గూర్చి చెప్పకపోవడానికి సరైన కారణం వుంది''

''ఏమిటా సరైన కారణం?''

''అదేకదా నే చెప్పపోతున్నది. ఈ లోపలే నీవు తుపాకీలో దూరి ప్రశ్నల గుండ్లు పేలుస్తున్నావ్''


''తుపాకీలో, దూరడానికి నేనేమైనా చీమనా? దోమనా? నీ పద ప్రయోగం మార్చుకో, తుపాకీ బదులు ఫిరంగి అని చెప్పు. ఈ కాలంలో సర్కస్ నైపుణ్యం ఉన్నా లేకపోయినా అన్ని సర్కస్‌లలో ఎవరో ఒకడు సిరంగి లోపల దూరి ఫైరింగై బయటకు వస్తాడు''

''పానకంలో పుడకలా అడ్డుపడుతున్న నీకు కథ చెప్తున్నందుకు నన్నెవరైనా చీపురుతో కొట్టాలి''

''నీ సూచన చక్కగా వుంది. అయినా నీకిది మామూలేకదా! ఈ దెబ్బలన్నీ నీవు తర్వాత తిను, ముందు ఆ కథ ముగించు''

''ముగించాల్సింది నీ కథే. పోరా బయటకు, ఇహ నీకు జన్మలో కథ చెప్పను''

''సారీ బ్రదర్! నీలో కొంచెం వేడి రగిలించడానికే ఇట్లా చేశాను, ఇప్పుడు కథలో



గూడా కొంచెం కారాన్ని ఎక్కువ చేయొచ్చు''

''ఒరేయ్... ఇది కారం, పులుపులు కలిపే కథ కాదురా, అసలిది కథే కాదు, వాస్తవంగా జరిగిన సంఘటనే''

''సరి సరి... కథ వినాలని ఎంతో ఆరాటం
వుంది చెప్పు... ఆ టీచర్ పేరేమిటి?''

''అయ్యయ్యో... దీనిగూర్చే గదా ఇం
సమయం వృధా అయింది. రెడ్డొచ్చె మొదలా

అన్నట్లు మళ్లీ తగులుకున్నావే!''

''సారీ, సారీ, గుర్తులేక అడిగాను. ఇకమీదట అతని పేరు నీవు చెప్పినా నేను వినను. ప్లీజ్ ప్రొసీడ్''

''అతని పేరు చెప్పకపోవడానికి తగిన కారణమున్నదని నేను చెప్పానుగదా! ఆ కారణమేమిటంటే అతని కొడుకు ప్రస్తుతం ఐ.పి.ఎస్. ఆఫీసర్‌గా వున్నాడు''

''ఇది మరీ బాగుంది, ఐపిఎస్ అయితే మాత్రం వాళ్లకి తండ్రి ఉండగూడదనే నియమమేమైనా వుందా? ఆలిండియా సర్వీసెస్ ప్రవర్తనా నియమావళిలో ఆ అధికారులకు నామధేయరహిత జనకులే వుండాలనే ఏదైనా సబ్‌క్లాజ్ వుందా?''

''అదిగో మళ్లీ కెలకడం ఆరంభించావా? నేను అతని పేరు చెప్పకపోవడానికి కారణం ఆ టీచర్ ఎవరో చెప్తే నీవూ గుర్తుపడతావ్? ఆ తర్వాతనే చెప్పే విషయాలు ఆ ఐపిఎస్ ఆఫీసర్‌కు తెలిస్తే నా దేహానికి ఎం తిప్పలు వచ్చిపడతాయో నాకే తెలియదు''

''అయితే నా మీద నీకు నమ్మకం లేదన్నమాట, నేను పోయి నీవు చెప్పిందంతా అతనికి చెప్పేస్తాననే గదా నీవనుమానించేదా?''

''అబ్బా. మిత్రమా. నీ పట్ల నాకు నమ్మకం లేదంటూ అన్యాయంగా ఆరోపించకు. నా భార్యమీద నాకెంత విశ్వాసముందో, అంతకుమించి నా భార్యమీద, సారీ నీమీద వుంది. అయితే ఒక్క విషయం. నా భార్య నోరు అన్నా, నీ నోరు అన్నా నాకు విశ్వాసం లేదు. అందువల్ల ఆ టీచర్ పేరు బయటకు వెల్లడి చేయకుండా నేనింకా ముందుకు వెళ్లాలో వద్దో నీవో తీర్మానించి చెప్పు''

''తీర్మానించడానికేముంది? నీవు కథను సాగించు. చేతిలో కొచ్చిన పండు చాలు, చెట్టు లెక్కం నాకెందుకు?''

''అలారా దారికి? ఆ తండ్రీ కొడుకుల పేరేకాదు, ఈ కథలో ఏ పాత్రపేరూ నేను బయటపెట్టను. అంతేకాదు, రాష్ట్రంలో ఈ ఐపిఎస్ ఆఫీసర్ ఏ ప్రాంతంలో పనిచేసే విషయంగూడా నేను చెప్పను''

''ఓకే ఓకే ప్రొసీడ్''

''మన కథలో టీచర్ ఉత్తముడనీ, మంచి ఆశయాలు కలవాడనీ సాధారణ ప్రజానీకం భావిస్తున్నారు. తను పనిచేస్తున్న గ్రామంలోకి ఆనాడు బ్రహ్మచారిగా ఒక్కడే వచ్చాడు. కొంతకాలం గడిచింతర్వాత ఒక మధ్యతరగతి కుటుంబంలోని అమ్మాయితో పరిచయం ఏర్పడి ఆమెనే వివాహం చేసుకున్నాడు. అంతవరకూ అద్దె ఇంటిలో వుంటున్న అతను వివాహానంతరం అత్తగారి చిన్న ఇంటిలోకి మకాం మార్చాడు. అతని భార్యకు తల్లి తప్ప వేరే బంధువులెవరూ లేరు. ఆ అమ్మాయి తండ్రి మిలట్రీలో పనిచేసేవాడట! 1965 సంవత్సరంలో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో అతను ప్రాణం కోల్పోయాడట, కొద్దిగా పొలం, ఇంటి స్థలం ఆ కుటుంబానికి ఉన్న ఆస్తి, భర్తృహీన అయిన ఆ తల్లికి వచ్చే కుటుంబ పింఛన్‌తో కాలం గడిచిపోతూ వుంది. పెండ్లి అయిన రెండు సంవత్సరాలకు ఆ టీచర్ దంపతులకు ఈ ఐపిఎస్ కుర్రాడు జన్మించాడు.

''మాతృగర్భంలోనే పద్మవ్యూహం గూర్చి సగం నేర్చుకుని బయటపడ్డ అభిమన్యుని మాదిరే ఇతనుగూడా తల్లి ఉదరంలోనే ఐపిఎస్ పరీక్ష వ్రాసి వెలుపలకి రాగానే ఇంటర్వ్యూకి వెళ్లాడనా నీవు చెప్పేది?''

''నేనలా చెప్పలేదు. ఈ కథలో నేను ప్రత్యేకించి పేర్లు ఏవీ పేర్కొనడంలేదుకాబట్టి. పాత్రలకు ఉపాధ్యాయుడనీ, గురుపత్ని అనీ, ఐపిఎస్ వ్యక్తి అనీ సంకేత నామాలివ్వక తప్పదు. మరికొన్ని పాత్రల్నిగూడా ప్రవేశపెట్టబోతున్నాను.

వాటిగూర్చికూడా నీవిట్లా ప్రశ్నించడం ప్రారంభిస్తే ఏ కారణం చెప్పకుండానే నేను కథ ముగింపు చేస్తాను. నేను కోరేది నీ చెవులు మాత్రమే. నీ నోరు అదేపనిగా పనిచేస్తూ వుంటే దానిలో ఏ చూయింగ్ గమ్మో, వక్కపొడో కూరుకుని కూర్చో''

''నేను నోటికి తేపాకటి అంటించుకుంటానులే. కానీ ఒక చిన్న ప్రశ్న. ఈ పెళ్లి ఎప్పుడు జరిగిందో అదొక్కటి మాత్రం చెప్పగలవా?''

''నాకభ్యంతరం లేదు. 1967లో ఆ టీచర్ పెళ్లి, 1969లో ఆ ఐపిఎస్ జననం. ఆ అబ్బాయికి ఐదేళ్ల వయస్సప్పుడు అంటే 1974లో ఏదో రుగ్మత చేసి అతని అమ్మమ్మ మృతిచెందింది. ఆ టీచరమ్మ - ఆమె టీచర్ పనిచేస్తున్నదనిగాదు. ఆ టీచర్‌గారి సహధర్మచారిణి - ఆమెగూడా ఎస్.ఎస్.ఎల్.సి చదివింది కాబట్టి, ఆ దంపతులు కొడుకును ఎంతో శ్రద్ధతో చదివించడం జరిగింది. అన్ని తరగతుల్లోనూ అతనిదే ప్రథమ స్థానం. పంతులమ్మకు కొడుకును ఒక డాక్టర్ చేయాలని కోరిక. పంతులుగారి ఉద్దేశ్యం మాత్రం అతన్ని ఒక ఇంజనీయర్నో, లెక్చరర్నో చేయాలని. కానీ చక్కగా చదువుతున్న ఆ ఐపిఎస్ అబ్బాయి మనసంతా భాషాధ్యయనంమీదే వుండేది. ఇంగ్లీషు, హిందీ రెండు భాషల్లోనూ అతను మంచి ప్రావీణ్యం సంపాదించాడు. ఈ రెండు భాషల్లో అతను కథలు, కవితలు వ్రాసి కాలేజీ మేగజైన్స్‌లో ప్రచురింపజేయడంకూడా జరిగింది. ఇంగ్లీషు ఎం.ఎ పూర్తిచేసిన వెంటనే అతను ఆలిండియా సర్వీసెస్ పరీక్ష వ్రాసి, ఒక మంచి ర్యాంకుతో ఐ.పి.ఎస్.కు ఎంపికయ్యాడు. తుదిఫలితం రావడంతో ఆ ఇంట్లో సంబరం మొదలైంది. ఆనందంతో పొంగిపోయిన ఆ తండ్రి భార్యను, కొడుకును తీసుకుని పుణ్యక్షేత్రాలు సందర్శించి ఈ జన్మ, గత జన్మ ఋణాల్ని కృతజ్ఞతాహృదయంతోనూ, ఆనంద భాష్పాభిషేకంతోనూ తీర్చుకోవడం జరిగింది. ఆ ఉపాధ్యాయుడికి స్కూల్లోనూ, బయటా ఒకేసారి ప్రమోషన్ లభించినట్లైంది. సహోపాధ్యాయులు, హెడ్‌మాస్టర్ ఒక డి.ఇ.ఓను చూసినంత గౌరవంగా అతణ్ణి చూడసాగారు. అతనితో వ్యవహరించేటప్పుడు ఊరివాళ్ల వైఖరిలోకూడా ఆశ్చర్యకరమైన మార్పు కనబడింది. తండ్రి

## టిఫిన్

''టిఫిన్ తెమ్మని చెప్పి మూడురోజులు అవుతుంది. ఇంకెప్పుడు తెస్తావు?'' కోపంగా అడిగాడు కస్టమర్.

''సారీసర్... నేను ఈ హోటల్లో చేరి రెండురోజులవుతుంది. మీరు చెప్పింది నాకుకాదు!'' అన్నాడు బేరర్.

- డి. క్రిస్టఫర్‌బాబు (మణుగూరు)



ఏనుగుమీద కూర్చుంటే కొడుకు పృష్ఠభాగం మొద్దుబారుతుందా అన్న సామెతగా, తనయుడు ఐపిఎస్ అయితే జనకునికి అహంభావం వుండదుగానీ, ప్రజల అతివినయ ప్రవర్తన అతన్నావిధంగా మత్తిల్లజేయవచ్చునేమో! కాని టీచర్ మాత్రం ఎంతో ఆత్మసంయమనాన్ని పాటిస్తూ ఎటువంటి అతిశయానికి ఆస్కారమివ్వలేదు.

ఆ ఐపిఎస్ అబ్బాయి శిక్షణకోసం ముసూరికి వెళ్లేముందు బంధుత్వాలను గుర్తుచేసుకుంటూ మిత్రుత్వాలను నటిస్తూ ఎందరో ఆ కుటుంబాన్ని విందులకు ఆహ్వానించడం జరిగింది. మరికొందరు ఆ అబ్బాయి రూప సౌకుమార్యంగూర్చి, శక్తి సామర్థ్యాలగూర్చి, సద్గుణ సంపత్తిగూర్చి కీర్తించడానికి మాత్రమే ఆ తండ్రిచుట్టూ చేరేవారు. ఇంకొందరు ఈ డొంక తిరుగుడు మార్గాలకు పోకుండా సరాసరి తమ కుమార్తెల వివాహ ప్రస్తావనను తీసుకురావడం జరిగింది. అబ్బాయి శిక్షణ అదంతా పూర్తయ్యేసరికి రెండున్నర సంవత్సరాలు పడుతుందని, వివాహ విషయం ఆ తర్వాతేనని ఆ అబ్బాయి తండ్రి ఆ ఐపిఎస్ వేటగాళ్లతో సవినయంగా మనవి చేశాడు. అబ్బాయి ట్రైనింగ్‌కు వెళ్లిన తర్వాత ఈ సంబంధ సందర్శకుల సంఖ్య క్రమేపీ తగ్గి దాదాపు ఆ రెండు నెలల తర్వాత పూర్తిగా ఆగిపోయింది. ఐపిఎస్ శిక్షణ పూర్తయి ఎస్.ఎస్.పిగా ఆ అబ్బాయి ఉద్యోగంలో చేరిన తర్వాత మళ్లీ పెళ్లి సంబంధ తరంగాలు ఆ ఉపాధ్యాయుని పాద ప్రక్షాళనం చేయడం ప్రారంభించాయి. ఈ దఫా అమ్మాయిల తల్లిదండ్రులు, పెళ్లిళ్ల పేరయ్యలు చాలా గట్టి ప్రయత్నాలు చేయడం కొనసాగించారు. ఉపాధ్యాయుడు వివాహ ప్రస్తావన చేసినప్పుడు అబ్బాయినుండి ఎటువంటి అభ్యంతరం రాలేదు. అందువల్ల ఆ శుభకార్యాన్ని ఇహ ఎటువంటి ఆలస్యం జరుగకుండా నెరవేర్చాలని ఉపాధ్యాయుడు, ఆయన సతీమణీ నిర్ణయించుకున్నారు. గొప్ప గొప్ప సంబంధాలు వచ్చినా ఉపాధ్యాయునికి జ్యోతిష్యంలో గట్టి విశ్వాసం ఉన్నందువల్ల వధూవరుల జాతకాలు సవ్యంగా సరిపడకుండా ఒక్క అడుగు ముందుకు వేయడానికైనా కూడా ఆయన సిద్ధపడలేదు. అబ్బాయికి సరిపోయిన యోగ్యమైన వధువులు ఎందరో లభ్యమైనా, అతని జాతకానికి సరిపడే జాతకాలు మాత్రం చాలా స్వల్పంగా వచ్చినై. ఆ వచ్చిన సంబంధాల జాతకాలన్నింటిని పరిశీలించి శ్రేష్ఠమైన తొమ్మిది పదింటిలో సంక్షిప్తంగా ఒక జాబితాను సిద్ధం చేశాడు ఆ ఉపాధ్యాయుడు. ఈ జాబితానుకూడా మరింత సూక్ష్మంగా జల్లెడపట్టి మూడునాలుగు జాతకాలను ఆయన ఎంపిక చేయడం జరిగింది.

''వింటున్నావా? లేక కళ్లు తెరిచే నిద్రపోతున్నావా? ఏమిటి? బోరుగా వుందా?''

''నాకు బోరేం కొట్టలేదుగాని, రెండువిషయాలగూర్చి తీవ్రంగా ఆలోచిస్తున్నాను. ఒకటేమిటంటే ఆ ఐపిఎస్ ఆఫీసర్‌ని నేనే అయితే ఎంత బాగుండేది? నాన్నగారు చూసే పెళ్లి సంబంధాల సుందరాంగుల గృహాలకు వెళ్లి, కావాల్సినంతగా ఫలహారాలు సేవించి, వాళ్లతో హాయిగా సరస సల్లాపాలు ఆడుకోవచ్చుగదా! అన్ని యోగ్యతలున్న బ్రహ్మచారిగా నన్ను ఎవ్వరైనా తమ గృహాలకు ఆప్యాయంగా ఆహ్వానించేవారు. ఎందరెందరో సుకుమార రాకుమార్తెల నయనాల తళతళలుగా నేను మారి వుండేవాణ్ణి. ఊర్వశి, మేనక, రంభ, తిలోత్తమవంటి భామినుల దివ్యస్వప్నాలలో నేనునాయకుణ్ణి అయి వుండేవాడిని!''

''ఒరేయ్ ఒరేయ్ ముందు నీ పగటి కలలు ఆపరా. నీ వయస్సు ఏభై దాటిందన్న విషయం వదిలేయ్, నీవు తాతవై రెండు సంవత్సరాలైందన్న విషయం మర్చిపోతే ఎట్లారా?''

''అందుకే నేను గతానికి పరుగుపెట్టే కలల్ని కంటున్నాను. కనీసం భావనల్లోనైనా నేనొక అదృష్ట బ్రహ్మచారిని కాలేనా?''

''నీ భార్య, పద్మావతి అమ్మమ్మకు ఈ విషయం తెలిస్తే నీ బ్రతుకేమవుతుందీ? సరే నీవాలోచించే ఆ రెండో విషయం ఏమిటి?''

''ఆ తండ్రి అంత సీరియస్‌గా పెండ్లి సంబంధాలు చూస్తున్న తరుణంలోనే ఈ ఎ.ఎస్.పి ఒక ఐ.ఎ.ఎస్ అమ్మాయితో ఏదైనా ప్రేమ వ్యవహారంలో పడితే నీ కథలకు భలే మలుపు వచ్చేదే? లేదా సినిమాల్లో చూపిస్తున్నట్లుగా మానవతకూ, స్నేహతత్వానికీ మూర్తీభావమైన ఈ ఐపిఎస్ యువకుడు పతితోద్ధరణాలయంలో కాలం వెళ్లదీస్తున్న ఒక అభాగ్యురాలికి నూతన జీవితాన్ని ప్రసాదించడానికి ముందుకు వస్తే, ఆదర్శజీవుడైన ఆ గురునాథుడు ఒక తిరోగమనవాదిగా మారిపోతాడా? అంటే విలన్ రూపం ధరిస్తాడా అనేదే నేను ఆలోచిస్తున్న రెండో విషయం''

''ఒరేయ్ ఒరేయ్ నీవిట్లా ఆలోచిస్తూ నీ బుర్ర బద్దలు కొట్టుకోకు. పితృవాక్య పరిపాలకుడైన ఆ దాశరథికన్నా మర్యాదా పురుషోత్తముడే మన యువ నాయకుడు. తండ్రి అభిప్రాయానికి వ్యతిరేకంగా అతను ప్రవర్తిస్తాడని కలలో కూడా అనుకోవద్దు''

''అయితే పరిపాలనా విషయంలో గూడా ఆ ఎ.ఎస్.పికి ఇహ ఎటువంటి సమస్యా వుండదు. ఆ తండ్రే అన్ని విషయాలూ చూసుకుంటాడు. సబ్-ఇన్స్‌పెక్టర్లు, ఇన్స్‌పెక్టర్లు, రోజూ బడికి వెళ్లి ఆ ఉపాధ్యాయునికే శాల్యూట్ చేస్తే చాలన్నమాట.''

''ఒరే మూర్ఖుడా ఆ ఎ.ఎస్.పి ఉద్యోగం చేసేది ఎక్కడ? స్కూలు పక్కనున్న కిల్లీ కొట్టులోనో? అతన్ని ఏ ప్రాంతంలో నియమించిందీ నేను నీకు తెలియజేయలేదే, సరే, ఇప్పుడు చెప్తా విను. తండ్రి పనిచేసే ప్రదేశానికి కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో ఆ ఎ.ఎస్.పి ఇప్పుడు పనిచేస్తున్నాడు.

''అంటే ఈ పెళ్లి సంబంధాలూ, పెళ్లి అతను లేకుండానే జరిగిపోతున్నాయా?''

''ఇందులో నీకింకా సందేహమా? ఈ విషయంలో అబ్బాయి తండ్రికి బ్లాంక్ చెక్ ఎప్పుడో

## హిట్లర్ కావాలి!

*'శివసేన' అంటే బాల్‌థాకరే - బాల్‌థాకరే అంటే శివసేన! ఆయనకు మహారాష్ట్రంలో ఎంతో ఫాలోయింగ్ వుంది! ఆయన ఈ మధ్యన ఓ సమావేశంలో మాట్లాడుతూ మన దేశానికో హిట్లర్ కావాలి - జర్మనీలో అవినీతిని వేళ్లతో పెకిలించడానికి హిట్లర్ కష్టపడినట్లే మన దేశంలోకూడా అలాంటి ఓ నాయకుడు కంకణం కట్టుకుని ఈ పుణ్యం కట్టుకోవాలంటున్నాడు బాల్‌థాకరే! మీ మాటలు నిజంగా నిజం సార్!*



- జూపిటర్

ఇచ్చేశాడు''

'ఆ తండ్రిదిహ మహర్దశో'

''ఇక్కడ మహర్దశ అని చెప్పడానికేముంది? కొడుక్కి గొప్ప సంబంధాలు రావడం ఏ తండ్రికైనా గర్వకారణమే. ఇక్కడ అబ్బాయికి ఇంత పెద్ద ఉద్యోగం లేదనుకో, ఇటువంటి సంబంధాలు ఎట్లా వస్తాయి? ఇట్లా చూస్తే ఇది ఆ తండ్రికి మహర్దశ అని చెప్పడంలో తప్పులేదులే'

''సరే ఇంతకీ ఆ అబ్బాయి పెళ్లి అయిపోయిందా?''

''దానిగురించేగదా నే చెప్తున్నది. ఆ ఉపాధ్యాయునికి రెండు సంబంధాలు బాగా నచ్చినై. అందులోనూ పట్టభద్రురాలైన, ఏకైక సంతానమైన, రూపవంతురాలైన గల్ఫ్ అమ్మాయి సంబంధం మరీ మరీ నచ్చింది. ఆ అమ్మాయి తండ్రి చాలాకాలం గల్ఫ్‌లో వుండి కోట్లు గడించాడు. ప్రస్తుతం ఈ ఊళ్లోనే స్థిరపడ్డాడు. ఆ పిల్ల బి.ఏ ఇక్కడే చదివింది. తండ్రి అప్పుడప్పుడు గల్ఫ్‌కు వెళ్లివస్తుంటాడు. తన స్వంత ఊళ్లో ఆయన నిర్మించినటువంటి బంగ్లా ఈ చుట్టుప్రక్కల ఊళ్లలో మరెక్కడా లేదు. రాజప్రసాదంవంటి ఆ భవనాన్ని చూసిన ఉపాధ్యాయుని నేత్రాలు కొన్ని క్షణాలు నిర్నిమేషంగా వుండిపోయినై. ఈ సంబంధం ఒక పెళ్ళిళ్ళ పేరయ్య కుదిర్చాడు. ఉపాధ్యాయుడు ఆ గల్ఫుడిని రెండుమూడుసార్లు కల్సుకోవడం జరిగింది. అమ్మాయి అబ్బాయిలు పరస్పరం చూసుకోకపోయినా ఒకరి ఫోటో మరొకరు చూసుకుని ఇష్టపడడంతో ఈ సంబంధం దాదాపు నిశ్చయమైనట్లే అన్పించింది. ఈ దశలో ఉపాధ్యాయుడు, గల్ఫుడి మధ్య నాలుగో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జరిగిందేమిటో యథాతథంగా నీకు వివరించే ప్రయత్నం చేస్తాను.

గల్ఫుడి ఆతిథ్య మర్యాదలన్నీ స్వీకరించి, ఊరి విషయాలు, ఇంటి విషయాలు ముచ్చటించిన తర్వాత వెళ్లిపోవడానికి సిద్ధమైనాడు ఉపాధ్యాయుడు. ఎంతో మొహమాటపడుతూ రెండు విషయాలు మాట్లాడాలని గల్ఫుడితో అన్నాడు అతడు. కట్నం తీసుకునే విషయంలో ఎంత విముఖత ఉన్నా ఈ వచ్చిన సంబంధాలను బేరీజు వేసుకున్నప్పుడు కనీసం మనసులోనైనా ఏది ఎక్కువ ప్రయోజనకరమో అన్న విషయాన్ని ఆలోచించకుండా ఉండలేకపోయాడు. గల్ఫుని ఆస్తికి వారసురాలిగా ఒక్కగానొక్క అమ్మాయి ఉన్నందువల్ల అతడు ప్రత్యేకించి కట్న కానుకల విషయం ఏమీ ప్రస్తావించలేదు. అయినాగూడా తన ఐపిఎస్ కొడుకు ఉజ్వల భవిష్యత్తుకోసం ఆ పిల్ల పేరుమీద ఆస్తిపాస్తులు ఎంత ఉన్నాయో కనీసం తెలుసుకోవాలన్న ఆరాటం ఆ ఉపాధ్యాయుడికి కలిగింది.

''రెండు విషయాలగురించి కొద్దిగా తెలుసుకోవాలనుంది. అడగడం అపరాధమైతే మన్నించండి'' తటపటాయిస్తూ గల్ఫుడితో అన్నాడు.

ఏదో పాన్ మసాలా ప్రకటనా ఫిలింలో పెళ్లి విషయంలో మరొక్క విషయం అడగడం మర్చిపోయాను అని షమ్మీ కపూర్ అన్నప్పుడు అశోక్ కుమార్ దంపతుల ముఖాల్లో ప్రదర్శితమైన ఆందోళనా ఛాయలేవీ ఈ గల్ఫుడి ముఖంలో కన్పించలేదు.

''ఎందుకండీ అంతగా వెనుకా ముందాడతారు? మీ మనసులో ఏ సందేహమున్నా అడగండి'' అంటూ గల్ఫుడు మందస్మితం చేస్తూ అనగా ఉపాధ్యాయుడి గుండెదడ కొద్దిగా తగ్గింది.

''ఈ ఇల్లు అమ్మాయిపేరుమీదనే వుందికదూ. వుండాలని కాదు. ఊరికే తెల్సుకోవాలనే అడుగుతున్నాను'' చదువులు


వంటబట్టక ఆత్మవిశ్వాసం కోల్పోయిన విద్యార్థి ప్రశ్నించినట్లుగా అడిగాడు ఉపాధ్యాయుడు. తాను ఎన్నోసార్లు దాటిన సముద్ర అగాధమంత గుంభనమైన నవ్వు నవ్వాడు గల్బుడు.

''సరే. ఇది మీ మొదటి ప్రశ్న. ఇహ రెండోది ఏమిటోచెప్తే ఒకేసారి సమాధానం చెప్తాను'' గురువుకు గురువుగా ప్రశ్నించాడు గల్బుడు.

ఉపాధ్యాయుని నొసలు ముడుచుకున్నాయి. తప్పుకోవడానికి వీలులేని అవస్థను జీవితంలో మొదటిసారి ఎదుర్కొంటున్నట్లుగా భావించాడు. నా మొదటి ప్రశ్నకే సమాధానమీయడానికి ఆయనకు అభ్యంతరమేముంది? ఇహ నా రెండో ప్రశ్నకు అతని ప్రతిక్రియ ఏవిధంగా వుంటుందో మరి భగవంతుడా? ఇప్పుడు ఆ రెండో ప్రశ్నను అడక్కుండా వుండడానిక్కూడా వీల్లేదు. కానీ ఈ రెండో ప్రశ్నను ఏవిధంగా తెలియజేయాలి? లేని ధైర్యాన్నంతా కూడదీసుకుని ఊపిరి ఆడనంత దైన్యస్వరంతో అన్నాడు ఉపాధ్యాయుడు.

''ఇది నాకు సంబంధించిన ప్రశ్నకాదు, నా భార్యకు మాత్రం ఈ విషయం గూర్చి తెలుసుకోవాలని పెద్ద ఆసక్తి వుంది. కలలోకూడా ఆ వస్తువును పెద్ద పరిమాణంలో చూసే అవకాశం నా భార్యకు కలగలేదు కాబట్టి, కనీసం తన కోడలివద్దనైనా అది ఎంత మొత్తంలో వుంటుందో తెలుసుకోవాలన్న ఉత్సుకత ఆమెది. ఎన్నోసార్లు ఆమెకు నచ్చచెప్పాను. ఇది అడిగే విషయం కాదనీ, వివాహం అయిన తర్వాత నీ కళ్లతోనే నీవు చూడవచ్చుగదా అని. కానీ ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా తెల్సుకోవాలన్నదే ఆమె ఆరాటం. తెల్సుకోవడం ఎందుకంటారా? తెల్సుకుని పులకరించిపోవడానికి. ఈ విషయాన్ని ఆడవాళ్లు వాళ్లకు వాళ్లు ప్రశ్నించుకుంటే తప్పులేదు. నాకు మాత్రం మనస్కరించడంలేదు. ఆమె ఆరాటంలోకూడా అనౌచిత్యమేమీ లేదనే భావిస్తున్నాను. మానవుల్లో వివిధ రకాలు. కొందరికి ఎంతో ఇష్టమైన వస్తువులపట్ల మరికొందరికి అసలు ఆసక్తే వుండదు. చాలామంది ఎంతో విలువైనదని భావించే వస్తువును కొనడం, నిరుపయోగమైన పెట్టుబడిగా తలపోస్తారు ఇంకొందరు...''

''అయ్యో అసలు ఇంతవరకు చెప్పలేదే? చెప్పదల్చుకున్నదేదో సాఫీగా చెప్పండి'' కన్ఫూషియస్ నవ్వుతో అన్నాడు గల్బుడు.



ఈ మాటతో ఉపాధ్యాయునికి కొంత ధైర్యమొచ్చింది.

''నేను అడగదల్చుకున్నది బంగారం గూర్చే. కోడలికి ఒంటినిండా బంగారు నగలుండాలన్నదే నా భార్య అభిలాష. ఈ కాలంలో కొందరు అమ్మాయిలు బంగారమంటేనే విముఖత్వం చూపుతారన్నదే ఆవిడ భయం. కొందరు అమ్మాయిలకు వెండి ఆభరణాలను, అదీ నల్లని వెండితో చేసినవాటిని ధరించాలన్న ఉబలాటం వుంటుంది. వాటిని చూస్తే అవి ఏ పురావస్తు మ్యూజియంనుండి తెచ్చినవోనన్పిస్తుంది. మరికొందరమ్మాయిలకు మెడలో అసలు ఏవీ ధరించాలని వుండదు. ఇంకొందరికి ముత్యాలతోగానీ, చౌకబారు పూసలతోగాని చేసిన గొలుసుల్ని వేసుకోవాలనుకుంటారు. నా శ్రీమతి మదినిండా ఉన్న కోరిక ఏమిటంటే తన కోడలికి కనీసం వంద తులాల బంగారు ఆభరణాలైనా వుండాలని'' చెప్పవలసిన ఈ నాలుగు మాటలూ చెప్పి ఆ ఉపాధ్యాయుడు తృప్తిగా శ్వాస పీల్చాడు. ఆ నిమిషంలో అతని గుండెల్లో పేరుకుపోయిన బరువంతా దిగిపోయినట్లుగా ఫీలైనాడు.

మళ్లీ గల్పుడి ముఖంపై అగాధమైన చిరునవ్వు దర్శనమిచ్చింది. అతని కంటి కొలకుల్లోనూ అధరాల కొసల్లోనూ కథాకళి నృత్య నిపుణులు ప్రదర్శించే ప్రత్యేక భావం లాస్యం చేసింది.

''ఇహ మీ మొదటి ప్రశ్నకు సమాధానం చెప్తున్నాను. ఈ ఇల్లు మా అమ్మాయి పేరుమీద కాక, నా భార్య పేరుమీద వుంది. తను పుట్టి పెరిగిన ఊళ్లో ఒక మంచి ఇల్లు కట్టుకోవాలని నా భార్యకెప్పటినుండో కోరిక వుండేది. తను జీవించి ఉన్నంతకాలం ఈ ఇంట్లో వుండాలన్నదే ఆమె అభిలాష. మా తర్వాత అమ్మాయేకదా ఈ ఇంటికి వారసురాలు? అంటే మేం జీవించి ఉన్నంతకాలం అమ్మాయికి వేరే ఇల్లు అవసరం లేదని గాదు మా ఉద్దేశ్యం. ఆమె ఇష్టపడ్డట్లుగా స్విమ్మింగ్‌పూల్, టెన్నిస్‌కోర్టుతో సహా ఈ ఇంటికి రెట్టింపు ఉండే ఒక పెద్ద భవనాన్ని కట్టించబోతున్నాం. ఇహ మీ రెండో ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో నాకు తెలయడంలేదు. మా అమ్మాయికి మూడొందల తులాల బంగారు ఆభరణాలు ఇప్పటికే ఉన్నాయి. వివాహ సమయంలో అవసరమైతే మరికొన్ని నూతన ఆభరణాలు చేయించడానికి నేను సిద్ధంగా వున్నాను. ఆమె మా ఏకైక సంతానం. మా ఆస్తిపాస్తులన్నీ ఆమెకేకదా చెందేది? మీ రెండు ప్రశ్నలకు మీకు సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వలేకపోయాను. ఈ ఇల్లు ప్రస్తుతం అమ్మాయి పేరుమీద మార్చడం ఆమెకీ ఇష్టంకాదు. నా శ్రీమతికికూడా ఇట్లా చేయడం నచ్చదేమో! అందుకే ఆ పని ఇప్పుడు చేయడం వీలుకాదు.

మీ రెండో ప్రశ్నకు కూడా నేనిచ్చిన సమాధానం మీకు తృప్తిని కలిగించి వుండదు. ఒకవేళ నా జవాబు మీకు ఆమోదయోగ్యంగా వున్నా మీ ప్రశ్న మాత్రం నాకు నచ్చలేదు. మీకూ మీ భార్యకు కావాల్సింది వంద తులాల బంగారమే. మరి అధికంగా వున్న రెండొందలు లేదా మూడొందల తులాల బంగారాన్ని నేనేం చేయాలి? అరేబియా సముద్రంలోనో, బంగాళాఖాతంలోనో, హిందూ మహా సముద్రంలోనో పారేయాలా? పెండ్లికి ముందు చాలా విషయాలు అడిగి తెలుసుకోవడం మంచిదే. కాని కొన్ని విషయాలు అడగకుండా, చెప్పకుండా వుండడమే శ్రేష్ఠం. మీ అంచనాలకు తగ్గస్థాయికి నేను ఎదగలేనందుకు చాలా విచారిస్తున్నాను. మీకూ మీ శ్రీమతికి అన్ని విధాలా నచ్చిన ఒక కోడలు తప్పక లభిస్తుంది. ఇంతటి సమర్థుడైన కొడుకును కన్న తల్లిదండ్రులకు ఎటువంటి నిరాశా కలుగదు. అన్నివిధాలా మీకు

నచ్చిన కోడలు లభించాలని ఆ దైవాన్ని ప్రార్థిస్తున్నాను. ప్రస్తుతానికి మనం సెలవు తీసుకుందాం. మీరు నాపట్ల చూపిన అభిమానానికి కృతజ్ఞతలు. గుడ్‌బై'' అని చెప్తూ ఆ గల్ఫుడు లేచి నిలబడి నమస్కారం పెట్టాడు. ఊహించని ఈ పరిణామానికి నివ్వెరపోయిన ఉపాధ్యాయుడు అసంకల్పితంగా తనూ ప్రతినమస్కారం చేశాడు. ప్రపంచమంతా తన కళ్లముందే తిరుగుతున్న అనుభూతి కలిగిందతనికి. ఏదో మాట్లాడాలని అన్పించినా, ఇంటి లోపలికి వెళ్లిపోతున్న ఆ గల్ఫుడిని వెనక్కి పిలవడానికి ధైర్యం చాలలేదతనికి.

''ఊ... ఎట్లా వుంది నా కథ?''

'కాని కథ పూర్తిచేయలేదుగా? ఐపిఎస్ అబ్బాయి పెళ్లి ఇంకా కాలేదా? ఏ అమ్మాయిని చేసుకున్నాడు? మరి ఆ గల్ఫుడి అమ్మాయి ఎవర్ని పెండ్లాడింది?''

''ఆ ఉపాధ్యాయుడిలా నీవు రెండు ప్రశ్నలడుగుతున్నావు. సరే జవాబులు చెప్తాను. ఐపిఎస్ అబ్బాయి పెండ్లి సంబంధాలకు వచ్చిన కరువేదీ లేదు. మరో రెండు నెలలకు ఆ ఐపిఎస్ అబ్బాయి పెళ్లి ఒక మనీబాగ్‌తో ఘనంగా జరిగింది. ఇక నీ రెండో ప్రశ్న. ఆ గల్ఫుడి కూతురు ఎవర్ని చేసుకుందన్నదే కదా? దానికి జవాబు చెప్పాలంటే నన్ను మాత్రం కాదు. ప్రాణస్నేహితుడా... నాకటువంటి కోరిక లేదనికాదు... ఏభై ఐదు సంవత్సరాల వయసుకలిగి ఒక భార్య, ముగ్గురు పిల్లలున్న నాకు ఎవరైనా ధనం, రూపం ఉన్న అటువంటి చిన్న అమ్మాయిని ఇస్తారా? నీవేమీ బాధపడకు, త్వరలోనే నేను గల్ఫ్‌కు వెళ్లి ఒక అందాల చిన్నారి లక్ష్మిని నిక్కాహ్ చేసుకుని వచ్చినప్పుడు నీవు సంతోషిస్తావుకదా!

## కష్టం

''ఏమండీ మీ అబ్బాయి ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడట. బాగా కష్టపడినట్లున్నాడు'' అడిగాడు సుబ్బారావు.

''అవునవును. హెడ్‌మాస్టర్ కూతుర్ని కిడ్నాప్‌చేయడానికి ఎంత కష్టపడ్డాడో'' చెప్పాడు అప్పారావు.

-సిహెచ్. శ్యాంకుమార్ (ఇల్లందు)

